


స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక



వరంగల్	సంపుటి : 02	సంచిక : 102	ఎడిటర్ : డి.శివకృష్ణ	గురువారం	29-10-2026	పేజీలు : 04	వెల : 2/-
WARANGAL	VOL : 02	ISSUE : 102	EDITOR : D.SHIVAKRISHNA	THURSDAY	29-10-2026	PAGES : 04	PRICE : 2/-

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక..

డీఏ పెంపునకు కేబినెట్ ఆమోదం




ఢిల్లీ:

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ), పెన్షనర్లకు కరువు ఉపశమనం (డీఆర్) 3 శాతం పెంచేందుకు ఆమోదం తెలిపింది. ఈ పెంపు 2026 జూలై 1 నుంచి అమల్లోకి రానుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ బుధవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ కేబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినికుమార్ వైష్ణవ్ మీడియాకు వివరించారు. దేశవ్యాప్తంగా సుమారు 48 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68 లక్షల మంది పెన్షనర్లు కలిపి 1.16 కోట్ల మందికి పైగా దీని ద్వారా ప్రయోజనం కలగనుంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ చెల్లిస్తారు. తాజాగా 3 శాతం పెంపునకు కేబినెట్ ఆమోదం తెలపడంతో ఉద్యోగుల వేతనాలు,

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ జీరో..

ఎమోజీ పోస్ట్‌తో ప్రధాని మోడీ సెటైర్



ఢిల్లీ:

ఉత్తరప్రదేశ్, బీహార్, కర్ణాటక, మహారాష్ట్రల పరిధిలోని ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బోణి కొట్టకపోవడంపై ప్రధాని నరేంద్ర మోడీ సెటైర్ వేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన కాంగ్రెస్ పరాజయాన్ని ఎత్తిచూపుతూ వినూత్నంగా ఎమోజీని జోడించి ఎద్దేవా చేశారు. ఈ మేరకు బుధవారం ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేసిన మోడీ.. 'ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ మరియు కర్ణాటక వంటి నాలుగు పెద్ద రాష్ట్రాల్లో 28 స్థానాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి నిర్వహించబడ్డాయి. మరి కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలుచుకుందో ఊహించండి చూద్దాం?' అంటూ ట్వీట్ చేశారు. బూతద్దం పెట్టి వెతుకుతున్నట్లు ఉన్న ఎమోజీని జోడించి చేసిన పోస్ట్ రాజకీయంగా చర్చనీయాంశమైంది. (మిగతా 2లో..)

ప్రభుత్వ కార్యాలయాల్లో

వంద శాతం ట్రీటెడ్ వాటర్..

సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

రాష్ట్రంలో ట్రీటెడ్ వాటర్ (శుద్ధి చేసిన మురుగునీరు) వినియోగాన్ని పెంచడంతో పాటు, తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గించడంపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఎస్టీపీలు (మురుగునీటి శుద్ధి ప్లాంట్లు), ట్రీటెడ్ వాటర్ వినియోగంపై బుధవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. శుద్ధి చేసిన నీటి నాణ్యత విషయం లో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రభుత్వ కార్యాలయాల్లో వంద శాతం ట్రీటెడ్ వాటర్‌నే వినియోగించాలని స్పష్టం చేశారు.

ప్లాంట్ల నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ



ట్రీటెడ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించాలని సీఎం సూచించారు. ప్రతి ప్లాంట్ వద్ద ప్రత్యేక అధికారిని నియమించి, నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్టీపీలు, ట్రీటెడ్ వాటర్ ప్లాంట్ల పనితీరుపై హైడ్రా పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. ప్లాంట్లను సౌర విద్యుత్‌తో నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును కూడా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. (మిగతా 2లో..)

'రిజర్వేషన్‌లే భవిష్యత్ తరాలకు మనమిచ్చే ఆస్తి'

జనగణనలో ఓబీసీ కాలమ్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలి

ఓబీసీ కాలమ్ పెట్టకపోతే తెలంగాణలో జనగణనను అడ్డుకోవాలి


రిజర్వేషన్లు తొలగించేందుకు బీజేపీ సర్కారు కుట్ర

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఐక్య పోరాటాలతో ఈ కుట్రను అడ్డుకోవాలి

ఓబీసీ డిక్లరేషన్ సభలో కల్వకుంట్ల కవిత

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేయడంలోనూ, బీసీ బిల్లు అమలు విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి చిత్తశుద్ధి లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని తన పెద్దన్న అని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, బీసీ బిల్లు ఆమోదం పొందిన తర్వాత అనేకసార్లు ప్రధానిని కలిసినప్పటికీ బీసీల ముచ్చట



మాత్రం ఎప్పుడూ ఎత్తలేదని ఆరోపించారు. రాష్ట్రపతి వద్ద ఆగిపోతుందని తెలిసే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ బిల్లులను ఇక్కడ ఆమోదించి కేంద్రానికి పంపిందే తప్ప సమస్య పరిష్కారంపై వారికి ఎలాంటి సీరియస్‌నెస్ లేదని స్పష్టం చేశారు. (మిగతా 2లో..)

సర్ పేరుతో ఓట్ల తొలగింపు..

కేంద్రంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపణలు



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకొని సర్ పేరుతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఓట్లను తొలగిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. సర్ పై రెండు సంవత్సరాల నుంచి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల తొలగింపు నిజమేనని తేటతెల్లం అయ్యిందన్నారు. తొలగించిన ఓట్లను పునఃపరిశీలించి.. వారికి ఓటు హక్కు కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్ (మిగతా 2లో..)

ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే

ఏఐ వినియోగ లక్ష్యం

: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

ఏఐతో ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఏఐ వినియోగ లక్ష్యమని పేర్కొన్నారు. 'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవంలో భట్టి విక్రమార్క బుధవారం పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఆయా కార్యాలయాల్లో అదా అయ్యే సమయాన్ని ప్రజలకు కేటాయించాలని సూచించారు.

కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలి..

రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే వరిస్థితి మారాలని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యం పెంపొందించేందుకే 'ఏఐ సాక్షమ్'ను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజాధనం వినియోగం, ప్రాజెక్టుల వ్యయాల విశ్లేషణకు ఏఐ ఉపయోగపడుతుందని వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయో, లేదో గుర్తించవచ్చని చెప్పుకొచ్చారు. విద్యుత్ డిమాండ్ అంచనా, పరికరాల లోపాల గుర్తింపులో ఏఐ కీలకంగా ఉపయోగపడుతుందని వెల్లడించారు. (మిగతా 2లో..)



ఓటరు దరఖాస్తులకు కలిన గడువులు పెట్టొద్దు..

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ:

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా భాగంగా ఎన్నికల సంఘం అనుసరిస్తున్న విధానంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటరు నమోదు, పేర్ల తొలగింపు, వివరాల మార్పులకు సంబంధించిన ఫారం-6, ఫారం-7, ఫారం-8లను ఎన్నికల సంఘం మార్చడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఢిల్లీలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా బుధవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఓటర్ల జాబితాలో పేరున్నవారిని మళ్లీ కొత్త (మిగతా 2లో..)

‘రిజర్వేషన్‌లే భవిష్యత్ తరాలకు మనమిచ్చే ఆస్తి’

(మొదటిపేజీ తరువాయి)

దేశవ్యాప్త ఓబీసీల న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని భాగ్ లింగంపల్లి ఆర్‌టీసీ కళ్యాణ మంటపంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. జనగణనలో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ ఇప్పటికే తీర్మానం చేసిందని గుర్తు చేసిన కవిత.. అదే తరహాలో తెలంగాణ అసెంబ్లీలోనూ తీర్మానం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అసెంబ్లీని సమావేశపరచాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకపోతే రాష్ట్రంలో జనగణనను నిలిపివేయాలని, అందుకు రాష్ట్రానికి అధికారం ఉందని ఆమె పేర్కొన్నారు.

మోడీ పేరుకు మాత్రమే బీసీ:

ఇప్పటికే జనగణనలో భాగంగా ఇళ్ల లెక్కింపు ప్రారంభమైందని, బీసీల జనాభా లెక్కలు తేల్చడంలోనూ నిర్లక్ష్యం చేస్తే వారి హక్కులకు తీవ్ర నష్టం జరుగుతుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు బీసీల పట్ల చిన్నచూపు ఉందని, బీసీలంతా ఐక్యంగా పోరాడితేనే రిజర్వేషన్ల సాధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జనగణన కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పుడు ఏ కులం జనాభా ఎంతన్నది ఎందుకు తేల్చడం లేదని ప్రశ్నించారు. దేశ బడ్జెట్ రూ.50 లక్షల కోట్లుగా ఉంటే బీసీలకు కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు.బీసీల హక్కుల కోసం పోరాడకపోతే భవిష్యత్ తరాలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ పేరుకు మాత్రమే బీసీ అని ఆయన బీసీలకోసం చేసిందేమి లేదని దుయ్యబట్టారు. పిల్లలకు భూములు, బంగారం, ఆస్తులు కూడబెట్టడం కంటే వారి భవిష్యత్తుకు భరోసానిచ్చే హక్కులను సాధించి పెట్టడమే నిజమైన ఆస్తి అని కవిత అన్నారు. బీసీ బిడ్డలకు జనాభా ప్రాతిపదికన తగిన రిజర్వేషన్లు కల్పిస్తే ఒక్క తరం జీవితాలే కాకుండా రాబోయే తరాల భవిష్యత్తు కూడా మారుతుందని పేర్కొన్నారు. ఓబీసీల హక్కుల సాధన విషయంలో రాజకీయ పార్టీలు, పట్టింపులకు అతీతంగా అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఏఐ వినియోగ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఏఐతో సమయం ఆదా..

ప్రభుత్వ ఉత్తర్వులు, నివేదికల తయారీలో ఏఐతో సమయం ఆదా అవుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఏఐ ఇచ్చే సమాచారాన్ని అధికారులు తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత సమాచార భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని చెప్పారు. ఏఐ వినియోగంలో తప్పులకు బాధ్యత వహించే వ్యక్తి ఎవరో స్పష్టత ఉండాలని అన్నారు. చిన్నస్థాయి ప్రయోగాల తర్వాతే ఏఐ వ్యవస్థల విస్తరణ చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలే ఏఐ విజయానికి కొలమానమని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

సర్ పేరుతో ఓట్ల తొలగింపు..

(మొదటిపేజీ తరువాయి)

చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం నిద్రపోతున్నట్లు నటిస్తోందని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా నవంబర్ 1న ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైళ్లలో ప్రయాణం చేయడానికి అనుమతి అడుగుతుంటే కేంద్రం నుంచి అనుమతి రాలేదని మంత్రి తెలిపారు. గత పది రోజుల నుంచి ఇండియా కూటమిని ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. రైల్వే అంటే కేంద్ర ప్రభుత్వం, బీజేపీ సొత్తు కాదన్నారు. రైళ్లు, బోగీలు ఇవ్వనందుకు పీసీసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు ఒక్కొక్కటి బయట పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

వృద్ధాశ్రమంలో ఘనంగా అల్పాహార వితరణ

ఆశా అగర్వాల్ నెలమాసికం సందర్భంగా అన్నదానం

స్టార్ త్రినేత్రం, వనస్థలిపురం:



మానవ సేవే మాధవ సేవ అనే భావనతో సమాజంలో ఆపన్నులను ఆదుకోవడంలో ముందుండే ‘కృష్ణ గోపాల్ సేవా సమితి’ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వృద్ధాశ్రమంలో ఉచిత అల్పాహార వితరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. లూధియానాకు చెందిన ఆశా అగర్వాల్ నెలమాసికం (మాసాంతిక సంస్మరణ) పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి ప్రతినిధులు, సభ్యులు ఉదయాన్నే వృద్ధాశ్రమానికి చేరుకుని అక్కడి వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న సుమారు 50 నుండి 60 మంది వృద్ధులకు స్వయంగా వడ్డిస్తూ కడుపునిండా రుచికరమైన అల్పాహారాన్ని అందజేశారు. వృద్ధులకు ఎలాంటి లోటు రాకుండా ప్రతి ఒక్కరికీ ఆప్యాయతతో సేవలందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... మనం చేసే చిన్నపాటి సహాయమైనా ఆపదలో, ఒంటరితనంలో ఉన్నవారి జీవితాల్లో ఎంతో సంతోషాన్ని, కొండంత ఆసరాను నింపుతుందని పేర్కొన్నారు. తమ కుటుంబాల్లో జరిగే పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి శుభకార్యాలైనా లేదా పెద్దల సంస్మరణ దినాలైనా... వాటిని సేవా రూపంలో నిర్వహించుకోవడం ద్వారా ఎంతో ఆత్మసంతృప్తి లభిస్తుందని తెలిపారు. తమ సంతోషాన్ని, బాధను సమాజ హిత కార్యక్రమాల ద్వారా పంచుకోవాలనుకునే దాతలు సంస్థను సంప్రదించవచ్చని కోరారు. ఆపదలో ఉన్నవారికి, నిరుపేదలకు సేవ చేసేందుకు తమ సమితి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు, వాలంటీర్లు పాల్గొని విజయవంతం చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే వారు 8106876999 నంబరును సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు



ప్రభుత్వ కార్యాలయాల్లో

వంద శాతం ట్రీటెడ్ వాటర్..

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ కార్యాలయాల్లో 100 శాతం ట్రీటెడ్ వాటర్

సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో), ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ పార్కుల్లో ట్రీటెడ్ వాటర్‌ను వినియోగించాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఆర్ పరిధితో పాటు ఇతర ప్రాంతాల్లో ల్యాండ్‌స్కేపింగ్, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే ఉపయోగించాలని సూచించారు. రైల్వే, మెట్రో రైల్ వ్యవస్థలను కూడా ట్రీటెడ్ వాటర్ వినియోగ పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. భవన నిర్మాణ అనుమతుల సమయంలోనే ట్రీటెడ్ వాటర్ వినియోగాన్ని తప్పనిసరి చేసేలా నిబంధనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. దీనివల్ల నిర్మాణ రంగంలోనూ శుద్ధి చేసిన నీటి వినియోగం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

ట్యాంకర్ల ట్రాకింగ్.. టోల్‌ఫ్రీ నంబర్

ట్రీటెడ్ వాటర్ సరఫరాలో పారదర్శకత పెంచేందుకు ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రజలు, సంస్థలకు శుద్ధి చేసిన నీటిని సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి సరఫరా, పంపిణీ వ్యవస్థను సమర్థంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్లకు సైతం ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. పెరుగుతున్న పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని విస్తరించాలని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య రావొద్దు:

అదే సమయంలో రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంచి నీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. తాగునీటి అవసరాలకు ఆటంకం కలగకుండా, ఇతర అవసరాలకు ట్రీటెడ్ వాటర్‌ను విస్తృతంగా వినియోగించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నికోలస్‌తో పాటు పలువురు కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ జీరో..

(మొదటిపేజీ తరువాయి)

బ్యాలెట్ పేపర్ ఎన్నికల ప్రస్తావన:

అయితే దేశంలో బీజేపీ విజయాల వెనుక ఈవీఎంల అవకతవకలు ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమేనని అందువల్ల లోక్‌సభను, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి తాజాగా బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరపాలని ఏఐసీసీ అగ్రనేత మల్లికార్జున ఖర్గే సహా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రధాని మోడీ తాజా ట్వీట్‌లో బ్యాలెట్ పేపర్ ఎన్నికల అంశాన్ని ప్రస్తావించడం రాజకీయంగా చర్చకు దారితీసింది. నాలుగు పెద్ద రాష్ట్రాల్లోని 28 స్థానాల్లో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పరిస్థితి ఏంటోని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఏ రాష్ట్రంలో ఎవరు గెలిచారు:

కాగా యూపీలో మొత్తం ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగగా నాలుగు చోట్ల బీజేపీ, రెండు చోట్ల ఎస్పీ విజయం సాధించాయి. బిహార్ లో మొత్తం నాలుగు చోట్ల ఎన్నికలు జరగగా ఇక్కడ ప్రశాంత్ కిశోర్ నేతృత్వంతోని జన్ సూరజ్ పార్టీ తొలిసారి శాసనమండలి ఖాతా తెరిచింది. జన్ సూరజ్, ఆర్జేడీ, బీజేపీ, ఇండిపెండెట్ ఒకరు విజయం సాధించారు. కర్ణాటకలో నాలుగు స్థానాలుక ఎన్నికలు జరగగా జేడీఎస్ ఒకటి, బీజేపీ మూడు చోట్ల విజయం సాధించాయి. ఇక మహారాష్ట్రలో ఐదు స్థానాల్లో బీజేపీ రెండు శివసేన ఒకటి, ఎన్సీపీ (ఎస్పీ) రెండు స్థానాలను కైవసం చేసుకున్నాయి.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక..

(మొదటిపేజీ తరువాయి)

పెన్షనర్లకు అందే మొత్తం పెరగనుంది. జులై 1 నుంచే ఈ పెంపు వర్తించనుంది.

కంటైనర్ తయారీకి ప్రోత్సాహం:

గ్లోబల్ సప్లై చైన్‌లో భారతదేశాన్ని కీలక శక్తిగా మార్చేందుకు కంటైనర్ తయారీ పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కంటైనర్ల తయారీలో 95 శాతం భాగస్వామ్యం కేవలం ఒకే ఒక్క దేశం చేతిలోనే ఉందని, ఈ రంగంలో భారత్ బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చామని మంత్రి అశ్వినీవైష్ణవ్ తెలిపారు. కంటైనర్ స్కీమ్ కు 13 ఏళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేయాలి కేబినెట్ నిర్ణయించిందని వెల్లడించారు. ఇది 13 ఏళ్ల సుదీర్ఘ కాలపరిమితి కలిగిన దీర్ఘకాలిక పథకమని, స్థిరమైన ప్రణాళికతో భారత్‌ను గ్లోబల్ కంటైనర్ హబ్‌గా మారుస్తామని పేర్కొన్నారు.

‘పీఎం వికసిత్ గ్రామ్ స్వరాజ్ యోజన’:

గ్రామీణ ప్రాంతాల్లో సామర్థ్య పెంపుదల, స్థానిక ప్రాధాన్యతలు-వనరుల ఆధారంగా అభివృద్ధిని ప్రోత్సహించేందుకు గాను రూ.7,395 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో ‘పీఎం వికసిత్ గ్రామ్ స్వరాజ్ యోజన’కు ఆమోదం తెలిపారు. ఇది గ్రామీణ భారతాన్ని బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలవనుంది.

క్రీడా పరికరాల తయారీ పథకం:

దేశంలో తయారీ రంగాన్ని రంగాలవారీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంలో భాగంగా క్రీడా వస్తువుల తయారీ పథకానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆయా రంగాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఖేలో ఇండియా స్కీమ్ కు 8 ఏళ్లలో రూ.1856 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది.

ఓటరు దరఖాస్తులకు కఠిన గడువులు పెట్టొద్దు..

(మొదటిపేజీ తరువాయి)



ఓటర్లుగా పరిగణించి ఫారం-6 నింపాలని ఎందుకు కోరుతున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన ధర్మాసనం ఈ కేసును తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఫారం-6తో మళ్లీ నమోదు ఎందుకు?

కాగా బుధవారం విచారణ సందర్భంగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 నిర్దేశిత నమూనాలని, వాటిలో మార్పులు చేయడం కుదరదని న్యాయస్థానం పేర్కొంది. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారి పేర్లు తొలగిపోయినప్పుడు, వారిని కొత్త ఓటర్లుగా పరిగణించి ఫారం-6 ద్వారా మళ్లీ నవోదు చేసుకోవాలని కోరడం ఎందుకని ప్రశ్నించింది. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారికి ఫారం-6 ఉపయోగిస్తారని, చిరునామా మార్పు కోసం ఫారం-8 నిర్దేశించారని ధర్మాసనం దృష్టికి వచ్చింది. ఇప్పటికే ఓటర్లుగా ఉన్నవారు తాము గతంలో ఏ ఓటర్ల జాబితాలోనూ లేమని ప్రకటించేలా ఫారం-6 నింపాలని కోరడం సమంజసం కాదని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు.

గడువుపై ప్రశ్న?:

ఢిల్లీలో సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనప్పటికీ అక్టోబర్ 30 నాటికి గడువు విధించడం ఎందుకని ధర్మాసనం ప్రశ్నించింది. ఓటర్ల పేర్ల పునఃనమోదుకు కటాఫ్ తేదీ విధించవద్దని సూచించింది. వివిధ కారణాలతో తమ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించలేకపోయిన ఓటర్లకు సులభమైన పరిష్కారం చూపాలని ఎన్నికల సంఘానికి ధర్మాసనం సూచించింది. గతంలో ఓటర్ల జాబితాలో పేరుండి, ప్రస్తుతం కనిపించని వ్యక్తులను కొత్త ఓటర్లుగా వర్గీకరించకుండా.. వారి పరిస్థితికి అనుగుణంగా పరిష్కారం కనుగొనాలని పేర్కొంది.

ఓటర్లను సంప్రదించాల్సిన బాధ్యత ఈసీదే

ఓటర్లు దరఖాస్తులు సమర్పించే వరకు ఎన్నికల సంఘం వేచి చూడకూడదని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అర్హులైన ఓటర్లను నేరుగా సంప్రదించి, వారి పేర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫారం-6, ఫారం-8 ద్వారా దరఖాస్తుల స్వీకరణను కొనసాగిస్తూ, వీలైనంత సరళమైన పరిష్కారాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. దరఖాస్తుల సమర్పణ గడువును పొడిగించేందుకు ఎన్నికల సంఘం సుముఖత వ్యక్తం చేసినట్లు విచారణ సందర్భంగా వెల్లడైంది.

కోహెడ గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌లో ఈ-వేస్ట్ సేకరణ, అవగాహన సదస్సు

కేంద్ర ప్రభుత్వ 'స్పెషల్ క్యాంపెయిన్ 6'లో భాగంగా ప్రత్యేక అసెంబ్లీ

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను బాధ్యతాయుతంగా పారవేయాలి: డైరెక్టర్ అల్లం రత్నారెడ్డి





స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్మెట్:

పర్యావరణాన్ని కాలుష్యం బారిన పడకుండా కాపాడుకోవడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే ముప్పును అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కోహెడ గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్ డైరెక్టర్ అల్లం రత్నా రెడ్డి పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, స్కూల్ ఎడ్యుకేషన్ ఉ లిటరసీ విభాగం, సమగ్ర శిక్షా మరియు 'ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్' మార్గదర్శకాలకు అనుగుణంగా... కోహెడలోని గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్ ప్రాంగణంలో బుధవారం "స్పెషల్ క్యాంపెయిన్ 6 – ఈ-వేస్ట్ కలెక్షన్ ఉ రెస్పాన్సిబుల్ డిస్పోజల్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఐ యామ్ యాన్ ఈ-వేస్ట్ వారియర్' నినాదంతో విద్యార్థులకు ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ అల్లం రత్నా రెడ్డి మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక యుగంలో ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం ఎంతగా పెరిగిందో, వాటి ద్వారా ఉత్పన్నమయ్యే ఈ-వ్యర్థాలు కూడా పర్యావరణానికి అంతే తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపయోగంగా మారిన మొబైల్స్, ఛార్జర్లు, ఇయర్ ఫోన్లు, బ్యాటరీలు, పాడైన విద్యుత్ వైర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను సాధారణ చెత్తతో పాటు రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వల్ల భూమి, భూగర్భ జలాలు విషతుల్యమవుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను బాధ్యతాయుతంగా సేకరించి, సరైన పద్ధతిలో రీసైక్లింగ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్‌ను ఆదా చేయాలని, పరిసరాలను ఎల్లప్పుడూ స్వచ్ఛంగా, పచ్చదనంతో ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రకృతిని ప్రేమించడం, వ్యర్థాల సరైన నిర్వహణపై అవగాహన కలిగి ఉండడం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల చొరవ – ఈ-వేస్ట్ సేకరణ

ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించారు. తమ ఇళ్లలో నిరుపయోగంగా పడి ఉన్న పాత ఛార్జర్లు, పాడైన ఇయర్ ఫోన్లు, ఎలక్ట్రికల్ వైర్లు, మొకులు, పాడైపోయిన స్మార్ట్‌వాచెస్, గడియారాలు, పాత కీబోర్డులు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు/మదర్‌బోర్డు విడిభాగాలు, పనికిరాని టెలిఫోన్లు, సిమ్ కార్డులు వంటి పలు రకాల ఎలక్ట్రానిక్ వస్తువులను స్వచ్ఛందంగా పాఠశాలకు తీసుకొచ్చారు. వాటన్నింటినీ క్రమపద్ధతిలో పాఠశాల ఆవరణలోని ఈ-వేస్ట్ ప్రత్యేక సేకరణ డబ్బాల్లో వేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ ఇన్‌ఛార్జ్ ఉ సోషల్ స్టడీస్ సీనియర్ టీచర్ తోటపల్లి ఆశీర్వాదం, సోషల్ సైన్స్ విభాగం సైరా బాను, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె. మహేశ్వర్ రెడ్డి, ఇంగ్లీష్ విభాగ ఉపాధ్యాయులు వెంకటేష్, రాజేంద్ర, నరేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ, క్యాంపస్ మేనేజర్ మరీని చంద్రశేఖర్, రెసిడెన్షియల్ కో-ఆర్డినేటర్ డి. కిరణ్ బాబు, రిసెప్షనిస్ట్ కల్పన, హాస్టల్ వార్డెన్లు, సీనియర్ ఉపాధ్యాయులు, బోధన-బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రంగశాయిపేటలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన గుండు చందన పూర్ణచందర్



స్టార్ త్రినేత్రం, వరంగల్:

వరంగల్ నగరంలోని రంగశాయిపేటలో ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం వరంగల్--నర్సంపేట రోడ్డులోని న్యూ వరంగల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, కురుమ సంఘం సహకారంతో ఆ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకొచ్చిన పలు రకాల ఎలక్ట్రానిక్ వస్తువులను స్వచ్ఛందంగా పాఠశాలకు తీసుకొచ్చారు. వాటన్నింటినీ క్రమపద్ధతిలో పాఠశాల ఆవరణలోని ఈ-వేస్ట్ ప్రత్యేక సేకరణ డబ్బాల్లో వేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ ఇన్‌ఛార్జ్ ఉ సోషల్ స్టడీస్ సీనియర్ టీచర్ తోటపల్లి ఆశీర్వాదం, సోషల్ సైన్స్ విభాగం సైరా బాను, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె. మహేశ్వర్ రెడ్డి, ఇంగ్లీష్ విభాగ ఉపాధ్యాయులు వెంకటేష్, రాజేంద్ర, నరేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ, క్యాంపస్ మేనేజర్ మరీని చంద్రశేఖర్, రెసిడెన్షియల్ కో-ఆర్డినేటర్ డి. కిరణ్ బాబు, రిసెప్షనిస్ట్ కల్పన, హాస్టల్ వార్డెన్లు, సీనియర్ ఉపాధ్యాయులు, బోధన-బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అందించడం అభినందనీయమన్నారు.న్యూ వరంగల్ హాస్పిటల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి విష్ణు మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీతో పాటు అన్ని ఆరోగ్య ఆసుపత్రి కార్డుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. రంగశాయిపేట ప్రజలకు ఆసుపత్రి బిల్లులు, పరీక్షలు, మందుల కొనుగోలుపై ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం గౌరవ అధ్యక్షులు మండల సీతారాములు, ప్రధాన కార్యదర్శి జినుక రమేష్, వైద్యులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ అయిషా, డాక్టర్ రాంబాబు, శిబిర నిర్వాహకుడు నాగరాజు, ఇన్‌చార్జి సోహెల్, రామాలయం ధర్మకర్త విలాసాగరం శ్రీనివాస్, మేరవాడ శివాలయం ధర్మకర్త పాలకుర్తి సుమన్, జినుక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..

ఆరోగ్యవంతమైన యువతతోనే వికసిత్ భారత్-2047 సాధ్యం: జిల్లా కలెక్టర్ సత్యశారద



స్టార్ త్రినేత్రం, వరంగల్:

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, విద్యపై దృష్టి సారించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించగా, తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై సందేశమిచ్చారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ సత్య శారద, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు బహుమతులు అందజేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, వాటి దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించి మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైన్ చైర్మన్ శనబోయిన రాజ్‌కుమార్, సలహాదారులు ఈవీ శ్రీనివాసరావు, కోశాధికారి బొల్లం శివ, నడెం శాంతికుమార్, మండల పరశురాములు, తోట సంపత్ కుమార్, మామిడాల రమేష్ బాబు, డాక్టర్ రాజ్‌కుమార్, తిరుపతిరెడ్డి, ముల్క ప్రసాద్, కళాశాల డైరెక్టర్లు సీహెచ్ వాణి, విశ్వాంబర్ రెడ్డి, అధ్యాపకులు ఎండీ అజం, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప స్వామి ఉత్సవాల్లో ఘనంగా పూజలు నిర్వహించిన బి.గోపాల్ ముదిరాజ్

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోపాల్ ముదిరాజ్‌కు ఘన సన్మానం

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడం అందరి బాధ్యత: బి.గోపాల్ ముదిరాజ్



స్టార్ త్రినేత్రం, కర్మన్‌ఘాట్:

కర్మన్‌ఘాట్ సమీపంలోని బైరమల్‌గూడలో వెలసిన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ బీరప్ప స్వామి, కామరాతి దేవి ఆలయంలో బీరప్ప పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మాధవ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి. గోపాల్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న గోపాల్ ముదిరాజ్‌కు కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని, కామరాతి దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులను విశేషంగా ఆకట్టుకున్న సాంప్రదాయ 'ఎల్లమ్మ--పరశురాముడు' వేషధారణ ప్రదర్శనను ఆయన తిలకించి, కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాధవ్‌నగర్ కాలనీ అధ్యక్షుడు బి. గోపాల్ ముదిరాజ్‌ను శాలువా కప్పి, తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బి. గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ... తరతరాలుగా వస్తున్న మన ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను, గ్రామీణ ఆచారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కులమ తాలకు అతీతంగా గ్రామాల్లో, పట్టణాల్లో ఐక్యతను పెంపొందించేందుకు బీరప్ప ఉత్సవాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. స్వామివారి కృపాకటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సకల ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఇంతటి పవిత్రమైన ఉత్సవాల్లో తనను ఆహ్వానించి ఘనంగా సత్కరించినందుకు ఆలయ కమిటీ సభ్యులకు, స్థానిక పెద్దలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రముఖులు చీర సురేష్, ఇమిడి బీరప్ప, చీర శ్రీనివాస్, ఇమ్మిడి రాజు, ఇమ్మిడి జంగయ్య, ఇమిడి బాలప్ప, యమ్మ భాష కురుమ, సిద్దాల గణేష్, లక్ష్మణ్ యాదవ్, కాలే జంగయ్య తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థుల కలలకు మార్గదర్శకంగా ఆడెపు ఓవర్సీస్

ఆడెపు ఓవర్సీస్‌ను సందర్శించిన తహసీల్దార్ల సంఘం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక

ఆడెపు ఓవర్సీస్ సేవలను అభినందించిన రమేష్ పాక




స్టార్ త్రినేత్రం, హనుమకొండ:

హనుమకొండలోని గ్రీన్ స్క్వేర్ ప్లాజాలో ఉన్న ఆడెపు ఓవర్సీస్ కన్సల్టెన్సీని తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కన్సల్టెన్సీ అధినేత ఆడెపు మధుసూదన్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఆడెపు ఓవర్సీస్ అందిస్తున్న సేవలు, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశ ప్రక్రియ, విద్యార్థులకు కల్పిస్తున్న మార్గదర్శకత్వం గురించి రమేష్ పాక వివరాలు అడిగి తెలుసుకున్నారు. విదేశీ విద్యకు అవసరమైన సమాచారం అందిస్తూ, విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునేందుకు సహకరిస్తున్న నంద సేవలను ఆయన అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడేలా ఇటువంటి సంస్థలు అందిస్తున్న మార్గదర్శకత్వం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు సరైన సమాచారం, తగిన సూచనలు అందించడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

క్రాంతి కుమార్ వివాహ వేడుకకు హాజరైన రాజప్రభాకర్ రావు

స్టార్ త్రినేత్రం, రంగారెడ్డి:

షాద్‌నగర్‌లో జరిగిన వివాహ వేడుకకు తెలంగాణ రక్షణ సేన కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజప్రభాకర్ రావు బుధవారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలానికి చెందిన తెలంగాణ రక్షణ సేన కార్యకర్త క్రాంతి కుమార్ వివాహానికి ఆయన హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తల కుటుంబ శుభకార్యాల్లో పాల్గొంటూ వారికి అండగా నిలవడం ద్వారా రాజప్రభాకర్ రావు తన అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తనిష్క, అనిల్ నాయక్, గణేష్, పద్మతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య సాగింది.



డైరెక్టర్ అంటే ఈ రేంజ్ గట్స్ ఉండాలి



సినిమా ఇండస్ట్రీలో ఒక అన్‌రిటెన్ రూల్ ఉంది.. సూపర్ స్టార్ డేట్లు దొరికితే ఎంతటి దర్శకుడైనా తన స్క్రిప్ట్‌ను మార్చేసుకుంటాడు సినిమా ఇండస్ట్రీలో ఒక అన్‌రిటెన్ రూల్ ఉంది.. సూపర్ స్టార్ డేట్లు దొరికితే ఎంతటి దర్శకుడైనా తన స్క్రిప్ట్‌ను మార్చేసుకుంటాడు. కానీ కథపై నిజమైన కన్విక్షన్ ఉంటే స్టార్ ఇమేజ్‌ను కూడా పక్కన పెట్టేయొచ్చని నిరూపించాడు జీతు మాధవన్. మొన్నటివరకు మోహన్ లాల్ తో సినిమా అంటూ పెద్ద ఎత్తున హంగామా నడిచింది. తీరా చూస్తే అంత పెద్ద ప్రాజెక్ట్ ను స్వయంగా రద్దు చేసుకున్నానని ఆయన ఓపెన్ గా చెప్పడం సౌత్ సినిమా వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. 'రోమాంచం', 'ఆవేశం' లాంటి సెన్సేషనల్ హిట్స్ తర్వాత ఎవరైనా సరే కాంబినేషన్ క్రేజ్ కోసం వెంపర్లాడతారు. మోహన్ లాల్ లాంటి దిగ్గజ నటుడు దొరికినప్పుడు ఎలాగైనా ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కించాలని చూస్తారు. అవసరమైతే యాక్షన్ సీక్వెన్స్‌లను కుదించి, తక్కువ రోజుల్లోనే కానిచ్చేద్దామని ఆలోచిస్తారు. కానీ జీతు మాత్రం ఆ రాజీ మార్గాన్ని ఎంచుకోలేదు. ఈ కథకు భారీగా వర్కింగ్ డేస్ అవసరమని, లాల్ ఏటన్ బిజీ షెడ్యూల్ వల్ల అంత సమయం కేటాయించలేకపోయారని ఉన్నదున్నట్లు చెప్పేశాడు. అంతేకాదు, ఒకరి కోసం రాసిన కథను మార్కెట్ కోసం మరొకరి చేతిలో పెట్టే ఆలోచన తనకు లేదని స్పష్టం చేశాడు. మోహన్ లాల్ ను దృష్టిలో పెట్టుకుని రాసిన కథను వేరే హీరోతో చేయలేనని తేల్చి చెప్పడం ఆయనలోని నిజమైన ఫిల్మ్ మేకర్ ను చూపిస్తోంది. క్వాలిటీ తగ్గించి, అడ్జస్ట్ అయి తెరకెక్కించడం కంటే అసలు ఆ సినిమానే ఆపేయడం నయమనుకోవడం చిన్న విషయం కాదు. కాంబినేషన్ల వెంట పడే ప్రస్తుత ట్రెండ్‌లో ఇలాంటి క్రియేటివ్ నిజాయితీ చాలా అరుదుగా కనిపిస్తుంది. కేవలం స్క్రిప్ట్ విషయంలోనే కాదు, క్యాస్టింగ్ ఎంపికలోనూ జీతు మాధవన్ రూట్ పూర్తిగా సపరేట్ గా ఉంది. సూర్య హీరోగా చేస్తున్న 'సీన్' సినిమాలో 'ప్రేమలు' ఫేమ్ నస్లెన్ ను విలన్ గా పెట్టడమే ఇందుకు నిదర్శనం. సాధారణంగా సూర్య లాంటి మాస్ హీరోకు ఎదురుగా ఒక పవర్ ఫుల్, భారీ కటౌట్ ఉన్న రొటీన్ విలన్ ను పెడతారు. అలాంటిది చాక్లెట్ బాయ్ ఇమేజ్ ఉన్న ఒక యంగ్ కుర్రాడిని మెయిన్ ప్రతినాయకుడిగా మార్చడం ఒక క్రేజీ ఆలోచన. సోషల్ మీడియాలో నడిచిన రకరకాల ఫ్యాన్ థియరీలను ఆయన కొట్టిపారేశాడు. సూర్య డబుల్ రోల్ చేస్తున్నాడంటూ వచ్చిన ప్రచారంలో నిజం లేదని తేల్చేశాడు. నస్లెన్ హీరో టీమ్ లో ఉండడని, అతనే అసలైన విలన్ అని క్లారిటీ ఇచ్చాడు. రెగ్యులర్ మూస పద్ధతులను బ్రేక్ చేస్తూ, ఒక అమాయకపు ముఖం వెనుక ఉన్న భయంకరమైన కోణాన్ని చూపించాలనుకోవడం ఆయన విలక్షణమైన టేకింగ్ కు నిదర్శనం. స్టార్ల కాల్షీట్ల కోసం కథలను చంపేసే రోజుల్లో జీతు మాధవన్ లాంటి మేకర్స్ ధోరణి ఇండస్ట్రీకి ఒక మంచి ఉదాహరణ. కంటెంట్ క్వాలిటీ కోసం సూపర్ స్టార్ సినిమాను వదులుకోవడం, మరోవైపు రొటీన్ విలనిజానికి భిన్నంగా నస్లెన్ లాంటి సాఫ్ట్ యాక్టర్ ను బరిలోకి దించడం నిజంగా పెద్ద డేరింగ్ స్టెప్. డైరెక్టర్ విజన్ ఇంత బలంగా ఉన్నప్పుడు, తెరపై వచ్చే ఫలితం కూడా అంతే ఫ్రెష్ గా ఉంటుందనడంలో సందేహం లేదు. ఇక కంటెంట్ ఎంతవరకు క్లిక్ అవుతుందో చూడాలి.

బాలీవుడ్‌లో ఆదర్శ భర్త ఎవరు?

బాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో ప్రేమ.. పెళ్లిళ్లు బంధాలు ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే ఉంటాయి. బాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో ప్రేమ.. పెళ్లిళ్లు బంధాలు ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే ఉంటాయి. అనేక మంది నటీనటులు జీవిత భాగస్వాములను ఆదర్శంగా కొనియాడుతుంటారు. అయితే ఈ తరం స్టార్లలో నిజమైన ఆదర్శ భర్త ఎవరు అనే ప్రశ్న ఎదురైనప్పుడు చాలామంది ప్రస్తుత తరం హీరోల పేర్లు చెబుతుంటారు. కానీ బాలీవుడ్ నటి ఈషా డియోల్ మాత్రం ఈ విషయంలో ఏమాత్రం ఆలోచించకుండా తన తండ్రి.. హి-మాన్ ధర్మేంద్ర పేరే చెప్పి ఆశ్చర్యపరిచారు. ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈషా డియోల్‌కు బాలీవుడ్ పరిశ్రమ మొత్తంలో ఆదర్శవంతమైన భర్త ఎవరు?" అనే ప్రశ్న ఎదురైంది. దానికి ఆమె క్షణం కూడా ఆలోచించకుండా చిరునవ్వుతో తండ్రి ధర్మేంద్ర పేరును వెల్లడించారు. తల్లి డ్రీమ్ గర్ల్ హేమమాలిని పట్ల తండ్రి చూపించే ప్రేమాభిమానాలు.. బాధ్యతాయుతమైన ప్రవర్తనే ఆయన్ని అత్యుత్తమ భర్తగా నిలబెట్టాయని గర్వంగా పంచుకున్నారు. ధర్మేంద్ర – హేమమాలినిల దాంపత్య బంధం బాలీవుడ్‌లోనే అత్యంత అరుదైనదిగానూ.. ఆదర్శవంతమైనదిగానూ పేరొందింది. ఎన్నో ఏళ్లుగా ఒకరికొకరు తోడుగా నిలుస్తూ జీవితంలోని కష్టసుఖాల్లోనూ పరస్పర గౌరవాన్ని కాపాడుకోవడం వారి ప్రత్యేకత అని ఈషా పేర్కొన్నారు. ఒక భర్తగా తన తల్లికి ఆయన ఇచ్చిన గౌరవం.. రక్షణ.. అనంతమైన ప్రేమ తర్వాతి తరాలకు మార్గదర్శకమని అభిప్రాయపడ్డారు. తమ కుటుంబంలో తండ్రి ధర్మేంద్ర పాత్ర కథానాయకుడిగానే కాకుండా.. కుటుంబ వ్యవస్థకు బలమైన పునాదిగా నిలిచిందని ఈషా తెలిపారు. హేమమాలిని వ్యక్తిగత, రాజకీయ జీవితంలో సాధించిన విజయాల వెనుక ధర్మేంద్ర ప్రోత్సాహం ఎంతో ఉందని.. భార్య ఎదుగుదలను చూసి గర్వపడే భర్త దొరకడం ఎంతో అదృష్టమని కొనియాడారు. ఈ గుణాలే ఆయన్ని నిజమైన ఆదర్శ భర్తగా మార్చాయన్నారు.నేటి కాలంలో బంధాలు, అనుబంధాలు చిన్న చిన్న కారణాలకే విచ్ఛిన్నమవుతున్న తరుణంలో ధర్మేంద్ర – హేమమాలిని దంపతుల జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని ఈషా వ్యాఖ్యానించారు. నటుడిగా వెండితెరపై కోట్ల మంది అభిమానాన్ని సంపాదించుకున్న తండ్రి నిజ జీవితంలో మంచి భర్తగా, బాధ్యతాయుతమైన తండ్రిగా సాధించిన విజయమే తమకు ఎంతో విలువైనదని భావోద్వేగంగా వెల్లడించారు. చివరగా ఒక మహిళ భాగస్వామిలో వెతుక్కునే అన్ని మంచి గుణాలు, నిబద్ధత తన తండ్రిలోనే పుష్కలంగా ఉన్నాయని ఈషా ముగించారు. అందుకే బాలీవుడ్‌లో ఎంతమంది నటులు ఉన్నా? భర్త అనే స్థానానికి నిలువెత్తు రూపం తన తండ్రి ధర్మేంద్ర మాత్రమేనని కుండబద్దలు కొట్టినట్లు స్పష్టం చేశారు.



అరుంధతి, మహానటి సినిమాలు హిట్టే.. కానీ హీరోయిన్ల కెరీర్‌లో ఆ కష్టాలేంటి?

సినిమా ఇండస్ట్రీలో ఒక బ్లాక్‌బస్టర్ సినిమా హీరో.. హీరోయిన్ల కెరీర్‌ను మార్చేస్తుందని చాలామంది అనుకుంటారు. సినిమా ఇండస్ట్రీలో ఒక బ్లాక్‌బస్టర్ సినిమా హీరో.. హీరోయిన్ల కెరీర్‌ను మార్చేస్తుందని చాలామంది అనుకుంటారు. కానీ ఒక్క హిట్ సినిమా వచ్చినంత మాత్రాన హీరోయిన్ కెరీర్ బాగానే ఉంటుందని చెప్పలేం. బయట సాధారణంగా ఉద్యోగాల కోసం అందరూ ఎంతలా టెన్షన్ పడుతూ ఉంటారో.. సినిమా ఇండస్ట్రీలో కూడా స్టార్ హీరోయిన్ల సైతం అవకాశాల కోసం అంటే టెన్షన్ పడాలి ఏమో అన్న విషయం.. కీర్తి సురేష్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూ వింటే అనిపిస్తుంది. మహానటి సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు, ఆ సినిమా తర్వాత అవకాశాలే రాలేదంట. 2018లో విడుదలైన 'మహానటి' సినిమా దివంగత నటి సావిత్రి జీవిత కథ ఆధారంగా తెరకెక్కింది. ఈ సినిమాలో సావిత్రి పాత్రలో కీర్తి సురేష్ అద్భుతంగా నటించారు. ఈ సినిమా తెలుగు సినిమా ఇండస్ట్రీలోనే ఒక కల్ట్ బ్లాక్ బస్టర్ అని చెప్పవచ్చు. ఈ చిత్రంలో నటనకు గాను కీర్తి సురేష్ ఉత్తమ నటిగా జాతీయ చలనచిత్ర అవార్డును కూడా అందుకున్నారు. ఒకరకంగా ఈ సినిమాలో కీర్తి సురేష్ నటించడం కన్నా జీవించింది అని చెప్పవచ్చు. కానీ అంత గొప్ప నటన తర్వాత అలానే అంత పెద్ద విజయం సాధించిన తర్వాత కూడా కీర్తి సురేష్‌కు ఊహించని పరిస్థితి ఎదురైంది. మహానటి విడుదలైన తర్వాత దాదాపు ఆరు నెలల పాటు ఆమెకు కొత్త సినిమా అవకాశాలు రాలేదని తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ విషయం తనకు కూడా ఆశ్చర్యాన్ని కలిగించింది. మహానటి కంటే ముందు కీర్తి సురేష్ ఎక్కువగా సాధారణ యువతి పాత్రల్లో కనిపించేవారు. కానీ ఈ సినిమా తర్వాత ఆమెపై దర్శకుల అభిప్రాయం మారిపోయింది. అరుంధతి సినిమా తరువాత అనుష్కకు ఎలాంటి పరిస్థితిలు ఏర్పడ్డాయో ఒకరకంగా కీర్తి సురేష్ కి కూడా అలాంటి పరిస్థితులే మహానటి తర్వాత ఏర్పడ్డాయి.ూశ్రీంశీ =ఘుఽ – దీఱస్రవ్ర దీశీం ఽవశ్రీబస్రబ 10: ఈసారి నామినేషన్ బరిలో ఎనిమిది మంది! 2013 నుంచి 2018 వరకు వరుస సినిమాలతో బిజీగా ఉన్నానని కీర్తి చెప్పారు. షూటింగ్, భోజనం, నిద్రతోనే తన రోజులు గడిచిపోయేవని తెలిపారు. అయితే, ఆరు నెలల విరామం తన ఆరోగ్యంపై దృష్టి పెట్టడానికి, వ్యాయామం చేయడానికి ఉపయోగపడిందని చెప్పారు. అలాగే డబ్బును ఎలా నిర్వహించుకోవాలో కూడా నేర్చుకున్నానని వెల్లడించారు. ఈ పరిణామాలు సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల కెరీర్ ఎలా ఉంటాయో అర్థం అయ్యేలా చేస్తున్నాయి. ఒక బ్లాక్‌బస్టర్ తర్వాత హీరోలకు వరుస అవకాశాలు రావచ్చు. కానీ హీరోయిన్లకు మాత్రం మంచి సినిమా చేసినా సరైన పాత్రలు దొరుకుతాయనే గ్యారంటీ ఉండదు. మొత్తం మీద గొప్ప గొప్ప మహానటులకు కూడా మన తెలుగు సినిమా ఇండస్ట్రీలో గ్యారెంటీ లేదా అన్న అనుమానం అందరికీ వ్యక్తం అవుతుంది.



సామాన్యుడు తెగిస్తే ఏకే 47.. గురూజీ రివీల్ చేసిన అసలు కథ!

త్రివిక్రమ్ సినిమా వేదికలపై మాట్లాడితే అందులో ప్రమోషన్ కంటే జీవిత పాఠాలే ఎక్కువగా కనిపిస్తాయిత్రివిక్రమ్ సినిమా వేదికలపై మాట్లాడితే అందులో ప్రమోషన్ కంటే జీవిత పాఠాలే ఎక్కువగా కనిపిస్తాయి. 'ఆదర్శ కుటుంబం' ఈవెంట్ లో ఆయన పంచుకున్న ఆలోచనలు వింటుంటే ఇది రెగ్యులర్ కామెడీ ఫ్యామిలీ డ్రామా కాదని అర్థమవుతోంది. కలహప్రియత్వం, పద్మవ్యూహం లాంటి లోతైన విషయాలను ప్రస్తావిస్తూ నేటి సమాజ పోకడలను ఆయన విశ్లేషించిన తీరు ప్రాజెక్ట్ పై ఉన్న అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. శ్రీకృష్ణుడు యాదవులు అంతమయ్యే సమయంలో చెప్పిన ఉద్ధవ గీతను ప్రస్తావిస్తూ త్రివిక్రమ్ చేసిన వ్యాఖ్యలు ఆలోచింపజేస్తున్నాయి. కలికాలంలో మనుషుల్లో కోరికలు పెరిగి, గొడవలు పెట్టుకోవడాన్ని ఎంజాయ్ చేసే కలహప్రియత్వం ఎక్కువవుతుందని కృష్ణుడు ఎప్పుడో చెప్పినట్లు అర్థమయ్యేలా వివరించారు. నేటి సోషల్ మీడియాలో రెండు మంచి కామెంట్లకు ఇరవై నెగెటివ్ ట్రోల్స్ ఎందుకు కనిపిస్తున్నాయో చెప్పడానికి ఈ పాయింట్ ను లింక్ చేశారు. కథలో అసలైన సంఘర్షణ బయట శత్రువుల కంటే మనుషుల మైండ్‌సెట్ చుట్టూనే తిరుగుతుందనే హింట్ ఇక్కడ దొరుకుతోంది. త్రిగుణ్ వర్షిణిల మధ్యలో ముకేశ్ కామెడీ ఈ క్రమంలోనే కుటుంబం అనే వ్యవస్థను ఆయన ఒక పద్మవ్యూహంతో పోల్చారు. స్నేహితులను ఎంచుకోవచ్చు, ప్రేమను కోరుకోవచ్చు గానీ కుటుంబం అనేది మన ప్రమేయం లేకుండా దక్కే ఒక బంధం. అలాంటి బంధాన్ని కాపాడుకోవడానికి చిట్టిబాబు, స్వర్ణ లాంటి సాధారణ వ్యక్తులు ఎంత దూరం ప్రయాణించారనేదే అసలైన కథ అని త్రివిక్రమ్ రివిల్ చేశారు. ఇంటికి ముప్పు వచ్చినప్పుడు ఒక సామాన్యుడు తెగిస్తే ఎంతటి విధ్వంసం సృష్టిస్తాడో దర్శకుడు చాలా బలంగా ఎస్టాబ్లిష్ చేశారు. పద్మవ్యూహంలోకి దిగినప్పుడు అందులోనే చిక్కుకుని అభిమన్యుడిలా మిగిలిపోతామా లేక పోరాడి అర్జునుడిలా గెలిచి వస్తామా అన్నదే కథలోని అసలైన సవాల్ అని గురూజీ హైలెట్ చేశారు. ఇంటి రక్షణ కోసం ఒక సాధారణ గృహస్థు చేసే పోరాటాన్ని మహాభారత యుద్ధంతో పోల్చడం త్రివిక్రమ్ పెన్ పవర్ కు నిలువెత్తు రూపం. క్లాస్ ఫ్యామిలీ కథకు 'ఏకే 47' అనే గన్ పేరును ఎందుకు జత చేశారో ఈ విశ్లేషణతో ఒక క్లారిటీ వచ్చేసింది. ఇక వెంకటేష్ ఇమేజ్ గురించి త్రివిక్రమ్ చెప్పిన నిర్వచనం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. రక్తం చిందించే కత్తులు, సుమోలు గాల్లో లేపకుండా కుటుంబ కథలతోనే దశాబ్దాలుగా తిరుగులేని సూపర్ స్టార్ గా కొనసాగుతున్న ఏకైక నటుడు వెంకీ. కుటుంబమే ఆయన అసలైన మాస్, కుటుంబమే ఆయన మజిల్ అంటూ ఇచ్చిన ఎలివేషన్ అదిరిపోయింది. 'నువ్వు నాకు నచ్చావ్' నాటి వెంకీ నమ్మకంతో మొదలైన వీరి ప్రయాణం, ఇన్నాళ్లకు మరో స్థాయికి చేరింది. ఆ రోజు ఆయన ఇచ్చిన సపోర్ట్ ఎప్పటికీ మర్చిపోలేనని త్రివిక్రమ్ అన్నారు. తప్పకుండా ఈ సినిమా అందరికీ నచ్చుతుందని తెలిపారు. చివరగా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న ఆంధ్ర ప్రజలు క్షేమంగా ఉండాలని, ఈ తుపాను వాళ్లకు కన్నీళ్లు కాకుండా కేవలం నీళ్లనే ఇవ్వాలని కోరుకున్నారు.



దుమ్మురేపుతున్న 'భోగి' పాటలు

శర్వానంద్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' ఆల్బమ్ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. శర్వానంద్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' ఆల్బమ్ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. సంపత్ నంది దర్శకత్వంలో 1960ల బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా విడుదలైన పాటలు కూడా ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. ఇప్పటివరకు విడుదలైన 'ఎగిలివారంగ', 'అన్నయ్య పానం' పాటలకు మంచి స్పందన వస్తోంది. 'ఎగిలివారంగ' పాట పల్లె వాతావరణాన్ని, తెలంగాణ మట్టి వాసనను ప్రతిబింబిస్తూ అప్పటి గ్రామీణ జీవనశైలిని కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించింది. ఇక 'అన్నయ్య పానం' పాట చెల్లెళ్లపై అన్నయ్య చూపించే నిస్వార్థమైన ప్రేమ మనసుకు హత్తుకునేలా ప్రజెంట్ చేసింది. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతానికి చంద్రబోస్ సాహిత్యం మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. 'అన్నయ్య పానం' పాటలో అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే అనురాగం, త్యాగం, విడదీయలేని అనుబంధాన్ని తన పదాలతో అద్భుతంగా ఆవిష్కరించారు. అలాగే 'ఎగిలివారంగ' పాటలో అప్పటి పల్లె జీవనానికి తన సాహిత్యంతో ప్రాణం పోశారు. 'ఎగిలివారంగ' పాటకు నల్గొండ గద్దర్ నర్సన్న, 'అన్నయ్య పానం' పాటకు సింగర్ శ్రీకృష్ణ అందించిన గాత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంగీతం, సాహిత్యం, గాత్రం కలగలిసి ఈ పాటలకు మరింత సహజత్వాన్ని తీసుకొచ్చాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com